నిర్లక్ష్యం నీడలో.. వరాహ పుష్కరిణి



ఉత్తరాంధ్ర ఇలవేల్పు సింహాద్రి అప్పన్నకు చెందిన వరాహ పుష్కరిణి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఉత్సవాలు జరిగినపుడు పది మంది కూలీలను పెట్టి, తుప్పలు కొట్టించడం మినహా అభివృద్ధి చర్యలు శూన్యం. స్వామివారి తెప్పోత్సవం జరిగే పుష్కరిణిని అభివృద్ధి చేయడంలో అధికారుల నిర్లిప్తత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏళ్ల తరబడి కనీస అభివృద్ధికి నోచుకోక పిచ్చి మొక్కలు పెరిగి, దారుణ స్థితికి చేరిన పుష్కరిణిని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

- కానరాని కనీస అభివృద్ధి
- అమలుకు నోచుకోని అభివృద్ధి ప్రణాళిక, గంటా హామీలు
- పుష్కరిణి చుట్టూ పెరిగిన తుప్పలు
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే చర్యలు శూన్యం
- అపర కర్మల ఘాట్ల నిర్మాణం ఎప్పుడో?


వరాహ పుష్కరిణి గట్టు చుట్టూ పెరిగిన కలుపు మొక్కలు, తుప్పలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు సింహగిరికి వచ్చే భక్తుల్లో ఉత్తరాంధ్రకు చెందిన గ్రామీణ ప్రాంత భక్తులే ఎక్కువ. వీరిలో చాలామంది స్వామివారి దర్శనానికి ముందు కొండదిగువనున్న వరాహ పుష్కరిణిలో స్నానమాచరించడం ఆనవాయితీ. ముఖ్యంగా చందనోత్సవానికి ముందు వచ్చే గంథం అమావాస్య, ఆ తర్వాత వచ్చే వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి రోజుల్లో మత్స్యకారులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో తరలివచ్చి స్నానాలు ఆచరిస్తారు. ఏటా వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిగే వార్షిక ఉత్సవాల్లో ఒకటైన తెప్పోత్సవాన్ని పుష్య బహుళ అమావాస్య రోజున పుష్కరిణిలోనే నిర్వహిస్తారు. ఇంతటి ప్రాముఖ్యత కల్గిన ఈ పుష్కరిణిపై మాత్రం దేవస్థానం అధికారులు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం పుష్కరిణి నలువైపులా తుప్పలు, కలుపు మొక్కలు భారీ ఎత్తున పెరిగి అరణ్యాన్ని తలపిస్తోంది.

జాడలేని అభివృద్ధి ప్రణాళిక

దాదాపు 14 ఏళ్ల క్రిందట వుడా సహకారంతో వరాహ పుష్కరిణిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. పుష్కరిణికి నలువైపులా ఉన్న గట్టు చుట్టూ తుప్పలు తొలగించి, సుందరీకరణ పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. గట్లపై బెంచీలు నిర్మించి, భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేసేందుకు పూనుకున్నారు. విద్యుద్దీపాలు ఏర్పాటు చేసి, వాకింగ్ ట్రాక్‌గా కూడా తీర్చిదిద్దేందుకు నిర్ణయం తీసుకున్నారు. అవన్నీ అప్పట్లో మీడియాలో ప్రచారానికి మాత్రమే ఉపయోగపడ్డాయి. ఆచరణలో ఆ ప్రణాళిక మరుగున పడింది.

అపరకర్మలకు అగచాట్లు


శ్మశాన వాటికకు వెళ్లే మార్గం గేటు పరిస్థితి

పుష్కరిణికి ఒకవైపు గట్టుని ఆనుకునే శ్మశాన వాటిక ఉంది. దాదాపు పదేళ్ల క్రిందటి వరకు అంత్యక్రియలకు వరాహ పుష్కరిణి ప్రధాన గేటు నుంచి లేదా గాంధీనగర్ వైపు ఉన్న వేరే మార్గం నుంచి పార్థివ దేహాలను శ్మశాన వాటికకు తీసుకెళ్లేవారు. అంత్యక్రియల అనంతరం ప్రధాన మార్గం వద్దనున్న ఘాట్‌లోనే అపర కర్మలు జరిపేవారు. ఒకేచోట అపరకర్మలు, పుణ్య స్నానాలు చేస్తుండటంపై స్థానికుల నుంచి, భక్తుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. దాంతో ప్రధాన మార్గానికి సమీపంలో ఎంఎంటీసీ కాలనీ వద్ద దేవస్థానం కొంతమేర ప్రహరీ గోడ తొలగించి, గేటు ఏర్పాటు చేసింది. ఆ మార్గంలోనే శ్మశాన వాటిక రాకపోకలు జరుగుతున్నాయి. అపర కర్మలకు వీలుగా రెండు ఘాట్లని నిర్మించేందుకు గత ట్రస్ట్‌బోర్డులో ఆమోదం తెలిపారు. వాటి నిర్మాణం ఇప్పటికీ జరగకపోవడంతో అపర కర్మలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన మార్గం కూడా అస్తవ్యస్తంగా మారింది.

మహిళలకు అరకొర మరుగు


మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఈ గదులే దిక్కు

పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. ముఖ్యంగా మహిళలు దుస్తులు మార్చుకునేందుకు కేవలం నాలుగు గదులతో కూడిన షెడ్ మాత్రమే ఉంది. ఇది ఎటూ సరిపోయే పరిస్థితి లేదు. దీంతో చాలా మంది మహిళలు ఆరుబయటే దుస్తులు మార్చుకునే దుస్థితి. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. ఆ దిశగా ఏర్పాట్లు చేసే పరిస్థితి లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంటా ఉత్తుత్తి హామీ

వరాహ పుష్కరిణిని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని 2014లో మంత్రి, ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అప్పట్లో హామీ ఇచ్చారు. భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదకరంగా ఉండేలా పుష్కరిణి రూపురేఖలు సమూలంగా మార్చేస్తామని చెప్పారు. భక్తులు ఆశించిన మార్పులైతే రాలేదుగానీ.. తుప్పలు, పిచ్చి మొక్కలతో పుష్కరిణి రూపు మాత్రం దిగజారింది. ప్రస్తుతం ఆయనే మళ్లీ గెలిచారు. కనీసం ఈసారైనా గత హామీలను గుర్తుకు తెచ్చుకుని, అభివృద్ధి చేయాలని భక్తుల ఆకాంక్ష.

రూ.40 లక్షలతో రెండు ఘాట్ల నిర్మాణం



వరాహ పుష్కరిణి వద్ద శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో అపర కర్మలకు వీలుగా తొలిదశలో రూ.40 లక్షలతో రెండు ఘాట్ల నిర్మాణాన్ని త్వరలో చేపట్టనున్నాం. ఇందుకు సంబంధించి టెండర్లు కూడా పిలిచాం. అతి త్వరలో పనులు ప్రారంభిస్తాం. ఆ తర్వాతి దశలో షెల్టర్ల నిర్మాణం కూడా చేస్తాం. పుష్కరిణి నలువైపులా ఉన్న కలుపు మొక్కలను, తుప్పలను తొలగించి శుభ్రం చేయిస్తాం. పుష్కరిణి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– రాంబాబు, ఈఈ, సింహాచలం దేవస్థానం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


జీవీఎంసీ జోన్‌-8 అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గంలోని జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సంబంధిత అధికారులను సూచించారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ జోన్‌-8 అధికారులతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు వార్డుల్లో యూజీడీ పనుల కోసం రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆయా ప్రాంతాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు అంశాలపై సూచనలు చేశారు. జెడ్సీ హైమావతి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆరిపాక హెచ్‌ఎంకు పదవీ విరమణ సత్కారం


నాగమల్లేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న పాలిశెట్టి సురేష్‌రాజ్ తదితరులు

సబ్బవరం: ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు అందించిన సేవలు ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చాయని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ అన్నారు. సోమవారం నాగమల్లేశ్వరరావుకు పదవీ విరమణ దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సురేష్‌రాజ్ నాగమల్లేశ్వరరావు దంపతులకు పూలమాలలు వేసి, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌పీ రాజు, బండారు రమణ, మహలక్ష్మినాయుడు, మళ్ల కోటేశ్వరరావు, శరగడం శ్రీనివాసరావు, అప్పన్న, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

3 నుంచి శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు


శారదాపీఠంలో అమ్మవారు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో గురువారం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు పీఠం ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల సువాసిని శక్తి దీక్ష జరుగుతుందన్నారు. ప్రతి రోజూ రాజశ్యామల సహిత చండీయాగం, సాయంత్రం కుంకుమ పూజలు, నీరాజన మంత్ర పుష్పం, నిత్య హోమం, శ్రీశారద అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వెల్లడించారు. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ప్రతి రోజూ ఓ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, భక్తులంతా తరలిరావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. 97వ వార్డు పులగానిపాలెంలో అప్‌గ్రేడ్ చేసిన సక్షం అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించి, పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పిల్లలకు పూర్తిస్థాయిలో పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. పిల్లలకు, గర్భిణులకు అందుతున్న రేషన్ గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శానాపతి వసంత, ఐసీడీఎస్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అభినందన


ఆనంద్‌కుమార్‌ను అభినందిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: పెందుర్తి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.ఆనంద్‌కుమార్‌ను జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దుశ్శాలువతో సత్కరించారు. వార్డుకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పారిశుధ్యంపై క్షేత్రస్థాయిలో అవగాహన



గొరపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ శ్రీను, వైస్ ఎంపీపీ దేముడు, అధికారులు

పెందుర్తి: 'స్వచ్ఛతా హీ సేవా–2024'కార్యక్రమంలో భాగంగా ఆంధ్రాయూనివర్సిటీ అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్ ఆధ్వర్యంలో గొరపల్లి పంచాయితీలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. సర్పంచ్ గొరపల్లి శ్రీను, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, పంచాయతీ కార్యదర్శి బి.వి.రమణ, గ్రామంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పోషకాహార వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

పరవాడ: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పరవాడ అంగన్‌వాడీ 2, 3 కేంద్రాల్లో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ టీవీ, మంచినీటి శుద్ధి యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పదార్థాలను అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు పాలు, పండ్లు, గుడ్లు, బియ్యం, పప్పుల ఆవశ్యకతను వివరించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణీలు, బాలింతలు, కిశోరబాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తయారు చేసిన వంటకాలను పరిశీలించి రుచి చూశారు. అనంతరం పోషకాహార కిట్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బి.రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, కూండ్రపు సోమునాయుడు, వర్రి హరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వుషు జట్టు


ఎంపికైన రైఫిల్ షూటింగ్ జట్టుతో సిబ్బంది

పరవాడ: మండలంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలోఏర్పాటు చేసిన రైఫిల్ షూటింగ్, వుషు పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావులు సోమవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జట్లను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రకటించారు. ఒకే రోజు వేర్వేరు జట్లకు పోటీలు నిర్వహించడమే కాకుండా క్రీడాకారులకు, వారి తల్లిదండ్రులకు వసతి సౌకర్యం కల్పించిన పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లుగా ఎస్.రామ్మోహన్, రమ్య, జి.రాజు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి కె.ఎం.నాయుడులకు అభినందనలు తెలిపారు.

వంగలి–2 అంగన్‌వాడీ అప్‌గ్రేడ్


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర

సబ్బవరం: ఐసీడీఎస్ సబ్బవరం ప్రాజెక్ట్ పరిధిలో సక్షం అంగన్‌వాడీగా అప్‌గ్రేడ్ అయిన వంగలి–2 అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ ఆకుల శ్రీహేమ సోమవారం ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసి, అదనపు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పోషక విలువలు అధికంగా ఉన్న ఆకుకూరలు, తృణ ధాన్యాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం మంచి నీటి శుద్ధి యంత్రాన్ని, బాల్యారంభ దశ సంరక్షణ, విద్యను అందించడంలో భాగంగా చిన్నారులకు దృశ్య, శ్రవణ విద్య కోసం టీవీలను ఏర్పాటు చేశారు. చిన్నారుల మానసిక, భావాత్మక అభివృద్ధికి పెయింటింగ్స్, చిత్రాలను అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, గ్రామ పెద్దలు గవర రాజు, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఎమ్మెల్యే పంచకర్లతో పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కీర్తిప్రియ

పెందుర్తి: పెందుర్తి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎ.కీర్తిప్రియ స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన సబ్ రిజిస్ట్రార్‌తో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని సూచించారు. దస్తావేజు లేఖర్ల రాష్ట్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలగ చిన్నారావు తదితరులు ఉన్నారు.

'ఫార్మా ప్రమాదాలపై చర్యలు తీసుకోండి'


అనకాపల్లి కలెక్టర్‌తో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పరవాడ జెడ్పీటీసీ పీఎస్ రాజు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలతో పాటు కాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కోరారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రతో కలిసి అనకాపల్లిలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరవాడ మండలంలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరవాడ ప్రాంతంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు, కాలువలను కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై జిల్లా కలెక్టరు సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా నిత్యకల్యాణం
- వైభవంగా గరుడసేవ


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా గరుడసేవ

వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

పీజీఆర్‌ఎస్‌కు ఆరు వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్‌-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 6 వినతులు అందాయి. 93వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో కాలువను ఆక్రమించి వేసిన షెడ్‌ను తొలగించాలని, 94వ వార్డు బీహెచ్‌పీవీ కాలనీ టీచర్స్ లేఅవుట్ సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని, అదే వార్డులో గౌతంనగర్‌లో రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని, 95వ వార్డు శేషాద్రినగర్‌లో పిచ్చి మొక్కలు తొలగించాలని, అదే వార్డు పాపయ్యరాజుపాలెంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో జోన్‌-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



పెందుర్తి–పులగానిపాలెం రహదారి నల్లక్వారీ సమీపంలో రోడ్డు మధ్యలో భారీ గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇక్కడి రోడ్డు కుంగిపోవడంతో ఈ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇటుగా ప్రయాణం చేస్తున్న వాహనదారులు ఆదమరిస్తే ఆస్పత్రి పాలవ్వాల్సిందే..! స్థానికులు పెద్ద మనసు చేసుకుని, దూరం నుంచి వచ్చేవారిని హెచ్చరించేలా ఆ గొయ్యిపై కొమ్మలు, కర్రలు ఉంచారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- పెందుర్తి

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తిగల నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తిచేసి 15 నుంచి 45 సంవత్సరాల వయసున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133242666 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.